ఉద్యోగాలు ఇప్పిస్తామనే
దళారులను నమ్మొద్దు
ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఎస్పీ కేపీఎస్ కిశోర్
పోలీస్ ఎంపికలకు నేడు ఫిజికల్ టెస్ట్ 7



కక్ష సాధింపుల్లేవ్!



నేర నియంత్రణపై పెరిగిన పోలీసు నిఘా

జ్ఞాపకాలు 2024

- వైసీపీ ఓటమి.. కూటమి ప్రభుత్వం రాకతో తగ్గిన వేధింపులు
- కూటమి పాలనలో ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు
- మహిళల రక్షణకు అభయ మహిళా రక్షక దళం
- దొంగతనాలను ఛేదించారు.. భారీగా సొత్తు రికవరీ
- హత్య కేసుల్లో హంతకుల అరెస్టు
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు.. సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి

ఈ ఏడాది మొదటి ఆరు నెలలు వైసీపీ పాలనలో జిల్లాలో శాంతి భద్రతలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాంతి భద్రతలపై నిఘానేత్రం సారించారు. రోడ్డు ప్రమాదాలు గతేడాదితో పోలిస్తే తగ్గాయి. చోరీల సొత్తు అప్పగింత, సెల్‌ఫోన్ల రికవరీలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అభయ మహిళా రక్షకదళం పేరిట మహిళలు, యువతులకు భద్రతపై భరోసా కల్పించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. కోడి పందేలు, క్రికెట్ బెట్టింగులను నివారించగలిగారు.

ఏలూరు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడానికి మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడానికి పోలీసులు పెద్దపీట వేశారు. అడుగడుగునా తనిఖీలు చేపట్టి గస్తీ ముమ్మరం చేశారు. వైసీపీ పాలనలో ఆక్రమణలు, అల్లర్లు, గొడవలు, రౌడీయిజం పెచ్చుమీరాయి. ఫిర్యాదులు చేసినా పోలీసులు కేసులు నమోదు చేసేవారు కారు. దీనికి ఆస్పత్రుల నుంచి వెళ్ళిన ఎమ్మెల్సీ ఇంటిమేషన్లే ఇందుకు సాక్ష్యం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఫిర్యాదులు వస్తే ప్రాథమిక విచారణ చేసి ఖచ్చితంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ ఈ ఏడాది ఏప్రిల్ 15న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ తనదైనశైలిలో జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడడానికి వినూత్న చర్యలను చేపడుతున్నారు. శాంతి భద్రతలు కాపాడడంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో పోలీస్‌శాఖ భేష్ అనిపించుకుంది.

చోరీలు..సొత్తు రికవరీలు

గతంలో జరిగిన దొంగతనాల్లో ఎలాంటి పురోగతి లేనేలేదు. గత ఆరు నెలలుగా పోలీస్‌శాఖ నేరస్తులపై నిఘా పెంచి వారిని అరెస్టు చేసి చోరీ సొత్తును ఎక్కడ దాసినా, ఎక్కడ అమ్మినా తీసుకొచ్చి బాధితులకు అందజేశారు. దొంగతనాలు అరికట్టడంలో రాత్రి, పగటి వేళ గస్తీ ముమ్మరం చేశారు. నేరస్తులపై నిఘా పెంచి గతంలో నమోదైన కేసులను ఛేదించి బాధితులకు పోగొట్టుకున్న వస్తువులను అప్పగించారు. భీమడోలు సర్కిల్, నిడమర్రు సర్కిల్, జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్ డివిజన్ నేరస్తులపై పట్టు బిగించి కేసులు ఛేదించగలిగారు. కొంతకాలం నుంచి ఎవ్వరికీ చిక్కకుండా 41 ట్రాన్స్‌ఫార్మర్స్ పగులగొట్టి రాగి వైరును అపహరించిన ముఠాను భీమడోలు సర్కిల్ పోలీసులు, ద్వారకా తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. ఆ ముగ్గురు ముఠా సభ్యులతో పాటు ఆ రాగి వైరును కొనుగోలు చేసిన జంగారెడ్డిగూడేనికి చెందిన పాతసామానుల వ్యాపారిని అరెస్టు చేశారు. మోటారు సైకిళ్లను అపహరిస్తున్న ముఠాలను అరెస్టు చేసి బాధితులకు అప్పగించారు. 150కి పైగా మోటారు సైకిళ్లను ఒకేసారి నూజివీడు సబ్ డివిజన్, ఏలూరు సబ్‌డివిజన్ పోలీసులు స్వాధీనం చేసి బాధితులకు అప్పగించారు. దసరాకు కొనుగోలు చేసిన స్కూటర్‌ను కొద్దిరోజుల్లోనే అపహరించడంతో బాధిత మహిళ ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొత్తం మీద ఆ స్కూటర్‌ను తీసుకొచ్చి బాధితురాలికి అందించడంతో ఆమె ఆ బండిని పట్టుకుని తీవ్ర భావోద్వేగానికి గురి కాగా అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాష్ట్ర మంత్రి లోకేశ్ దృష్టికి ఈ విషయం వెళ్ళడంతో ఆయన జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అభినందించారు. ఏలూరులో నలుగురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి రూ.88 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ డివిజన్ కస్టమ్స్ అధికారులు ఏలూరు కలపర్రు టోల్‌గేట్ వద్ద చెన్నై నుంచి బస్సులో తరలిస్తున్న రూ. 1.07 కోట్ల విలువైన స్మగుల్డ్ బంగారాన్ని పట్టుకున్నారు. చైన్ స్నాచింగ్ ముఠాలపై పట్టు బిగించారు. అయితే ఇంకా కొన్ని కేసులను పోలీసులు ఛేదించాల్సి ఉంది.

అభయ మహిళా రక్షక దళం

మహిళలకు, బాలికలకు, యువతులకు రక్షణ కోసం గతంలో దిశ యాప్ మాత్రమే ఉండేది. ఫోన్ ఉన్న వారు ఆ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పేవారు. నేడు అభయ మహిళా రక్షకదళం అనే పేరుతో ప్రత్యేక బృందాన్ని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ఏర్పాటు చేసి మహిళా పోలీసులతోనే గస్తీ ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న వారు 112కు కాల్ చేస్తే 10 నిముషాల్లోపు తాము అక్కడ ఉంటామని అభయ మిస్తున్నారు. రక్షకదళ సిబ్బంది నేరుగా విద్యార్థుల కళాశాలలకు, స్కూల్స్‌కు వెళ్ళి విద్యార్థినులకు అభయం ఇస్తున్నారు. తాము ఉన్నామంటూ ధైర్యం చెబుతున్నారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పి ఆత్మస్థైర్యం కల్పిస్తున్నారు.



ఆత్మహత్యలు.. విషాదాలు

ఆర్థిక సమస్యలతో జిల్లాలో కొట్టుమిట్టాడుతున్న కొందరు కుటుంబ కలహాలతో మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మొత్తం 30 మంది వరకు ఈ విధంగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పదో తరగతి ఫెయిల్ అయిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఏలూరులో ప్రేమించడం లేదని యువతిని ఓ ప్రేమోన్మాది కత్తితో నరికి చంపాడు. ఆపై అదే కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆపరేషన్ భయంతో ఓ రోగి ఏలూరులో ఆసుపత్రి నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జంగారెడ్డి గూడెంలో కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన వలస కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు పానీపూరి తినగా తీవ్ర కడుపు నొప్పితో మృత్యువాత పడ్డారు. ఏలూరులో బైక్‌ను తప్పించబోయి ఆటో పల్టీలు కొట్టిన ప్రమాదంలో ఇద్దరి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. జంగారెడ్డి గూడెం మండలం జల్లేరు వాగు వద్ద చేపల వేటకు వెళ్ళి ముగ్గురు ఒకేసారి మరణించడంతో తీరని విషాదం నెలకొంది. అదృశ్యమైన కేసులలో 2015 నుంచి ఇప్పటి వరకు ఇంకా 64 మంది మహిళలు, యువతల ఆచూకీ తెలియాల్సి ఉంది. ప్రేమ వ్యవహారాల్లోనూ, వివాహేతర సంబంధాల్లోను, ఆర్థిక వ్యవహారాల్లోనూ జిల్లాలో హత్యలు జరిగాయి. అన్ని హత్యకేసుల్లో హంతకులను పోలీసులు - మిగతా 8లో

తగ్గిన రోడ్డు ప్రమాదాలు

గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాత్రివేళ గస్తీ నిర్వహించి ఫేస్‌వాష్ కార్యక్రమాలు, డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఈఏడాది ఇప్పటి వరకు 475 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 241 మంది ప్రాణాలు కోల్పోయారు. 510 మంది గాయాలపాలయ్యారు. గతేడాది 633 రోడ్డు ప్రమాదాలు జరుగగా 254 మంది మరణించారు. 617 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది మరణాల సంఖ్య తగ్గించగలిగారు.



- దీపావళి పండుగ రోజున ఏలూరు వన్‌టౌన్‌లో స్కూటర్‌పై ఇద్దరు యువకులు గోనెసంచిలో ఉల్లి బాంబులు తీసుకెళ్తుండగా పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి.

ఉపాధి కూలీలకు.. తీపి కబురు

- ఇక కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు.. పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ



ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎన్డీయే ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు కూలీల కనీస వేతనాన్ని రూ.263 నుంచి రూ.300కు పెంచి ఇవ్వడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు పనివేళల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా విజిలెన్స్ అధికారిని నియమించనుంది. ఉపాధి హామీ పథకం కూలీలు ప్రస్తుతం నాలుగు గంటల పాటు పనిచేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్లు తనిఖీ చేయాలి. ఈ తరహా చర్యలతో కూలీ లకు సగటున రూ.300 వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్తర్ల బాగోతం నడుస్తోంది. కూలీల పనికి రాకపోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్తర్ల వేసి స్వాహా చేస్తున్నారు. వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు కూలీలకు పూర్తిగా వేతనం అందడం లేదు. అక్రమాలు అరికట్ట డానికి జిల్లాస్థాయిలో పర్యవేక్షించే జిల్లా విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు. జాబ్‌కార్డు ఉన్నవారందరికి దినసరి వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకుంటారు.

నిబంధనలు ఇవే..

ఉపాధి కూలీలకు కనీస వేతనం పెరగడానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. పనులు గుర్తింపు పనిప్రదేశానికి అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలను తయారు చేసి నేలస్వభావం, కూలీలు పనిచేయడానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. పని వేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్టర్లు తనిఖీ చేయాలి. పనిచేసే వేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాల రశీదులు ఇచ్చితంగా ఇవ్వాలి.

నూతన సంవత్సర వేడుకల్లో.. నిబంధనలు పాటించాలి

- మితిమీరితే కఠిన చర్యలు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ..వాహనాల తనిఖీలు
- ఎస్పీ కేపీఎస్ కిశోర్



ఏలూరు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : 'నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీస్ నిబంధనలు పాటించాలి. కాదని మితిమీరితే కఠిన చర్యలు తప్పవు' అంటూ ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. లౌడ్‌స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు వేడుకల్లో వినియోగించేందుకు సంబంధిత పోలీస్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, న్యూస్‌పేపర్లు, మేగ్జస్ హోర్డింగుల్లో అశ్లీలత కలిగిన పోస్టర్లు, ప్రకటనలు చేయకూడదన్నారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలు అనుమతించబడవని, ఎక్సైజ్‌శాఖ నుంచి లైసెన్సు లేనిదే లిక్కరు అమ్మరాదన్నారు. ప్రజలకు ప్రమాదం కలిగించే పేలుడు పదార్థాలు, ఫైర్ ఆర్మ్స్ ఉపయోగించరాదన్నారు. వేడుక కార్యక్రమాలు నిర్వహించే వారు మ్యూజిల్ సిస్టమ్ రాత్రి 10 గంటల తర్వాత ఉపయోగించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కూడళ్ళల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రికార్డింగ్‌లు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించబడుతుందన్నారు. ఆకతాయిలు మితీమీరి ప్రవర్తించే యువతను, రోడ్‌లపై చిందులు తొక్కే మందుబాబులను, ఇష్టానుసారంగా వాహనాలు నడిపే వారిని వీడియో కెమెరాల ద్వారా ఫొటోలు తీస్తామన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన బార్లు, క్లబ్‌లు ఇతర హోటల్స్‌లలో నిర్ణీత సమయం దాటి తెరిచి ఉంచితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనల ప్రకారం సరైన సమయానికే కార్యక్రమాలు ముగించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తామన్నారు. మహిళలు ఒంటరిగా, జనావాసాలు లేని ప్రదేశాలకు వెళ్ళవద్దని ఎస్పీ సూచించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పోలవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి నీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్లు పీకిపడేశారని, 40 రోజులుగా నీరులేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆదివారం కృష్ణారావుపేట గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఇటీవల డ్రెయినేజీల నిర్మాణం కోసం గ్రామంలో నీటి అవసరాలు తీర్చే ట్యాపుల కనెక్షన్లు తొలగించి, పైపులు పీకి పక్కన పడేశారన్నారు. దీంతో గత నలభై రోజులుగా నీటి సరఫరా లేక ప్రమాద కరంగా ఉన్న గోదావరి రేవు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. రోజు కూలి పనులు చేసుకునే తమకు నీటిని తెచ్చుకోవడం సమస్యగా మారిందని, అధికారులు స్పందించి పైపులైన్లు వేసి ట్యాపులు బిగించి నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.



మట్టి అక్రమ తవ్వకాలు

- అడ్డుకున్న హనుమాన్లగూడెం గ్రామస్థులు
- పోలీస్ స్టేషన్‌కు రెండు టిప్పర్ల తరలింపు



అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్

ద్వారకాతిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం కుడికాల్వ గట్టుపై మండలంలోని హనుమాన్లగూడెం వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. భీమడోలుకు చెందిన ఓ జనసేన నేత ఆధ్వర్యంలో ఈ తవ్వకాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఈ తవ్వకాలను ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్, టిప్పర్లు అక్కడి నుంచి వెళ్లకుండా ఆపారు. వివాదం ముదరడంతో భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్‌ఐ టి.సుధీర్ స్పందించి సిబ్బందిని ఘటనా స్థలానికి పంపారు. అయితే మట్టి తవ్వకాలు జరుతున్న పరిధి భీమడోలులోకి వస్తుందా..? లేదా ద్వారకాతిరుమల పరిధిలోకి వస్తుందా..? అని తేల్చలేకపోయారు. పోలసానిపల్లి, పంగిడిగూడెం గ్రామాలకు చెందిన వీఆర్వోలు అక్కడకు చేరుకుని ఆప్రాంతం ద్వారకాతిరుమల మండల పరిధిలోకి వస్తుందని గుర్తించారు. ట్రాలీ అందుబాటులో లేకపోవడంతో ఎక్స్‌కవేటర్‌ను ఘటనా స్థలంలోనే వదిలారు. రెండు టిప్పర్లను భీమడోలు స్టేషన్‌కు తరలించాలని సీఐ ఆదేశించారు.



మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు



సైనిక పాఠశాలల్లో ప్రవేశాలు

త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం 33 సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇక్కడ విద్యార్థులకు సీబీఎస్‌సీ విద్యతోపాటు, క్రమశిక్షణ, భౌతిక నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఇస్తారు. ఈ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశాల నోటిఫికేషన్(ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2025) వెలువడింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర అకాడమీల్లో చేరడానికి సిద్ధం అవుతారు. 'ఏఐఎస్ఎస్ఈఈ' దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాల్సి ఉంటుంది.

చివరి తేదీ 2025 జనవరి 13.

6వ తరగతి: 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు (2013 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

9వ తరగతి: 13 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు (2010 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

పరీక్షా విధానం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి పరీక్ష అన్ని ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. దీనిని రెండున్నర గంటల్లో రాయాలి. తొమ్మిదో తరగతి పరీక్ష ఇంగ్లీషులో మాత్రమే నిర్వహిస్తారు. దీనిని విద్యార్థులు మూడు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం: https://aissee.nta.nic.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, నివాస, జనన ధృవీకరణ సర్టిఫికెట్‌లతోపాటు పాస్‌పోర్ట్ ఫోటో అవసరం అవుతాయి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ వారికి రూ.800/- ఫీజు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 650/- ఫీజు ఉంటుంది.

సైనిక్ స్కూల్స్: తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం రెండు సైనిక పాఠశాలలు ఉన్నాయి. ఒకటి విజయనగరం జిల్లాలోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరి. దీనిలో 65 స్థానిక విద్యార్థులకు, మిగిలిన 35 శాతం జాతీయ కోటాలోకి వెళుతుంది. అంటే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి స్కూల్స్‌తోపాటు జాతీయ కోటా 35 శాతం(అంటే దాదాపు 400 సీట్లు)కి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కౌన్సెలింగ్ ప్రాసెస్: ప్రవేశ పరీక్ష పూర్తయిన 45 రోజుల లోపు స్కోర్ కార్డు ఇంటికి వస్తుంది. ఇందులో అర్హత పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ఇది దాదాపు 8 రౌండ్లుగా ఉంటుంది.

కలికిరి స్కూల్ - మొత్తం సీట్లు 105

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	10	1
ఎస్టీ	04	1
ఓబీసీ	18	1
డిఫెన్స్	08	1
జనరల్	26	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

కోరుకొండ స్కూల్ - మొత్తం సీట్లు 93

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	08	1
ఎస్టీ	04	1
ఓబీసీ	16	1
డిఫెన్స్	07	1
జనరల్	22	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

ప్రిపరేషన్: ఆరో తరగతి: ప్రధానంగా ఐదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలి. మొత్తం మార్కులు 200(మేథ్స్: 50, జనరల్ నాలెడ్జ్: 50, ఇంగ్లిష్: 50, జనరల్ ఇంటెలిజెన్స్: 50)

తొమ్మిదో తరగతి: మొత్తం మార్కులు 400(మేథ్స్: 200, సైన్స్: 50, ఇంగ్లిష్: 50, ఇంటెలిజెన్స్: 50, సోషల్: 50)

(ప్రతీ సబ్జెక్టులో కనీసం 25 శాతం మార్కులు రావాలి. టోటల్‌గా కనీసం 40 శాతం మార్కులు రావాలి)

తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

- ఎస్.కళ్యాణి
ప్రిన్స్‌పాల్, కాంత్రి కీన్ అకాడమి, హైదరాబాద్

నాల్కోలో టెన్త్, ఐటీఐ వారికి ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ 'నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో)' నుంచి 518 నాన్ ఎగ్జిక్యూటీవ్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వెలువడింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి జూనియర్ ఆపరేటీవ్ ట్రైనీలుగా నియమిస్తారు.

లాబొరేటరీ: 37 పోస్టులు- కెమిస్ట్రీ సబ్జెక్టుగా బీఎస్సీ ఆనర్స్ చదివి ఉండాలి.

ఆపరేటర్: 226 పోస్టులు. టెన్త్, ఐటీఐ చేసి ఎలక్ట్రానిక్స్, మెకానిక్స్, టెక్నీషియన్ మెకట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఏదో ఒకటి చేసి ఉండాలి.

ఫిట్టర్: 72 పోస్టులు-టెన్త్, ఫిట్టర్ ట్రేడ్‌లో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి.

ఎలక్ట్రికల్: 63 పోస్టులు-టెన్త్, ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్: 48 పోస్టులు- టెన్త్, మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి.

మైనింగ్ మేట్: 15 పోస్టులు - టెన్త్, మైనింగ్ మేట్ సర్టిఫికెట్

మోటార్ మెకానిక్: 22 పోస్టులు-టెన్త్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్.

నర్స్(గ్రేడ్-3): 7 పోస్టులు- ఇంటర్‌తోపాటు, మూడు సంవత్సరాల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఉండాలి. లేదా డిప్లొమా/బీఎస్సీ నర్సింగ్, ఒక సంవత్సరం అనుభవం ఉండాలి.

ఫార్మసిస్ట్: 6 పోస్టులు- సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్, ఫార్మసీ డిప్లొమా ఉండాలి. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉంటే ప్రాధాన్యం.

● లాబొరేటరీ, ఫస్ట్‌ఎయిడ్ తదితరాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారి వయసు 35 సంవత్సరాలు నిండి ఉండరాదు. మైనింగ్‌కు 28, ఇతర పోస్టులకు 27 సంవత్సరాలు దాటరాదు. అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. 2024 డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 21 తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. పూర్తి వివరాలకు https://nalco-india.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI



ఎస్‌బీఐలో పీఓలు 600

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 జనవరి 16 తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలి. అభ్యర్థులను ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఆఫీసర్ 600 పోస్టులు (ఎస్సీ-87, ఎస్టీ-57, ఓబీసీ-158,ఈ డబ్ల్యూఎస్-58, యూఆర్-240)

అర్హతలు: ఏదైనా సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి(2024 ఏప్రిల్ 1 నాటికి) (1994 ఏప్రిల్ 2 - 2003 ఏప్రిల్ 1 మధ్యలో జన్మించి ఉండాలి). వివిధ వర్గాల వారికి కేటగిరీలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఫీజు: రూ.750/- (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు చెల్లింపులో కొంత మినహాయింపు ఉంది)

చివరి తేదీ: 2025 జనవరి 16

ప్రిలిమినరీ పరీక్ష: మార్చి 8, 15న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం

ప్రిలిమినరీ: వంద మార్కులకు వంద ప్రశ్నలుంటాయి. ఒక గంట సమయంలో పూర్తి చేయాలి. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. ఇంగ్లీషు 40 ప్రశ్నలు, క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు

మెయిన్స్: మొత్తం 200 మార్కులకు 170 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల్లో పూర్తి చేయాలి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు-60 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్(30 ప్రశ్నలు-60 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ/ బ్యాంకింగ్ నాలెడ్జ్(60 ప్రశ్నలు, 60 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు, 20 మార్కు లు). డిస్క్రిప్టివ్ పేపర్ 50 మార్కులకు ఉంటుంది. దీనిని 30 నిమిషాల్లో పూర్తి చేయాలి.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, చిత్తూరు, ఏలూరు, గుం టూరు, విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం.

వివరాలకు bank.sbi/web/careers/current-openings వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

Dr. A.P.J.Abdul Kalam Young Research Fellowship



Description: Dr. A. P. J. Abdul Kalam Young Research Fellowship 2024 is an opportunity provided by the Technology, Education, Research and Rehabilitation for the Environment (TERRE) Policy Center to students pursuing or have completed undergraduate, postgraduate or Ph.D. degree in any field related to environmental research.

Eligibility: Applicants must be Indian citizens pursuing or having completed an undergraduate or postgraduate degree (M.Sc., M.E., M.A.) or Ph.D. degree in any field related to environmental research. They must be between the age group of 18 and 25 years old as of December 31st, 2024, and demonstrate outstanding research contributions made in India towards environmental protection or improvement.

Prizes & Rewards: A fellowship of up to 25,000 and a certificate

Last Date to Apply: 15-02-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/APJF1

Deakin India Postgraduate Bursary

Description: The Deakin India 20% Postgraduate Bursary 2024 is an opportunity provided by Deakin University, Australia to Indian graduates. This bursary aims to financially assist deserving students with their university fees and all study costs.

Eligibility: Open for Indian citizens with a valid Indian passport and residing in India at the time of application. They must also apply through a Deakin Authorised Agent based in India and have an overall score of 55% – 74.99% in their undergraduate degree.

Prizes & Rewards: A 20% reduction in tuition fees ***Last Date to Apply:*** 31-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/DIPB4

SCHOLARSHIP ALERT

Kotak Suraksha

Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 23-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

యాక్షన్ హంగామా



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సికందర్'. రష్మిక మందన్న కథానాయిక. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో సల్మాన్ లుక్, సంభాషణలు, యాక్షన్ హంగామాతో పాటు విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ టీజర్ చూసిన అభిమానులు.. ఈ సారి సల్మాన్‌కు హిట్ పక్కా అని ఆనందపడుతున్నారు. వచ్చే ఏడాది రంజాన్ కానుకగా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. అయితే, ఈ టీజర్ సల్మాన్ పుట్టినరోజున విడుదల కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఒక రోజు వాయిదా వేశారు. కాగా, ఇటీవలే విడుదలైన 'బేబీ జాన్', 'సింగమ్ అగైన్' చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించిన సల్మాన్ అభిమానులను అలరించారు.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. విశ్వకరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సినిమా టీజర్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 3న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 'ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'క' సూపర్ హిట్ తరువాత కిరణ్ అబ్బవరం చేస్తున్న చిత్రంగా 'దిల్ రూబా'పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి' అని చిత్రబృందం పేర్కొంది.



ఇక దబిడి దిబిడే

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబి కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణతో కలసి స్టెప్పులేశారు బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా. ఈ పాట ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. 'అమెరికాలో జనవరి 4న, ఇండియాలో జనవరి 5న 'డాకు మహారాజ్' సినిమాలోని మూడో పాటను విడుదల చేయనున్నాం. ఇక దబిడి దిబిడే' అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పేర్కొంది.

జనవరి 1న ట్రైలర్



దిల్ రాజు

హీరో రామ్‌చరణ్ 256 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటుచేసి మెగా అభిమానులు వరల్డ్ రికార్డు సాధించారని నిర్మాత దిల్ రాజు కొనియాడారు. విజయవాడలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కటౌట్‌కు ఆదివారం హెలికాప్టర్ ద్వారా పూలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దిల్ రాజు మాట్లాడుతూ సినీ రాజధాని, తెలుగు సినిమా పుట్టినిల్లుగా పేరొందిన విజయవాడలో ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జనవరి 1న గేమ్‌ఛేంజర్ ట్రైలర్ విడుదల చేస్తున్నామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చే సమయాన్ని బట్టి జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కటౌట్‌ను ఏర్పాటు చేసినందుకు గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డ్‌ను ఆ సంస్థ ప్రతినిధులు దిల్ రాజుకు అందజేశారు.

విజయవాడ (లబ్బీపేట),(ఆంధ్రజ్యోతి)



ప్రియాంక రీ ఎంట్రీ

బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా తిరిగి భారతీయ చిత్రాల్లో నటించనున్నారా? అంటే అవుననే అంటోంది బాలీవుడ్ మీడియా. ఎనిమిదేళ్ల క్రితం హాలీవుడ్‌కి వెళ్లిన ప్రియాంక 'సిటాడెల్', 'ద మ్యాట్రిక్స్ రిసరెక్షన్స్' వంటి వెబ్‌సిరీస్, సినిమాలతో పాపులర్ అయ్యారు. కాగా, బాలీవుడ్ డైరెక్టర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించనున్న 'జీ లే జరా' చిత్రంలో ప్రియాంక నటించనున్నారనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను ప్రియాంక గానీ, నిర్మాణ సంస్థ గానీ ధృవీకరించలేదు. దాంతో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే సినిమా ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో మరో వార్త బాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మహేశ్ బాబు హీరోగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించే ఎస్ఎస్ఎమ్‌బీ29 సినిమాలో ప్రియాంక ఛాన్స్ కొట్టేశారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వెలువడుతున్నాయి. దీంతో భారతీయ చిత్రాల్లోకి ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇచ్చే మూవీ ఇదేనని ఆమె అభిమానులు చర్చించుకుంటున్నారు.

మలయాళ సినిమాకు రూ.700 కోట్ల నష్టం

ప్రతీ ఏడాది విభిన్న తరహా చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది మలయాళ చిత్ర పరిశ్రమ. కానీ ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయినట్లు కేరళ చిత్ర నిర్మాతల సంఘం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ఏడాది రూ. 1000 కోట్లు పెట్టి 199 సినిమాలు నిర్మించగా.. కేవలం 26 చిత్రాలు మాత్రమే విజయతీరాలకు చేరాయని తెలిపింది.

పారితోషికమే పెద్ద సమస్య

"సినిమాల బడ్జెట్ అదుపులో ఉంటే ఉండాలి. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీయాలి. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో ఎక్కువగా ఫ్లాప్ అయ్యినందున ప్రొడక్షన్ ఖర్చుల్లో కోత విధించాలి. నటీనటుల పారితోషికం ఒక పెద్ద సమస్యగా మారింది. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోవడానికి సిద్ధపడాలి. ఈ విషయాన్ని పలుసార్లు నటీనటులతో ప్రస్తావించాం. కానీ వారు తగ్గించుకోకపోగా మరింతగా పారితోషికాన్ని పెంచుకుంటున్నారు. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోకుంటే తీవ్ర సంక్షోభం తప్పదు. పక్క రాష్ట్రాల్లో తగిన మార్కెట్ లేకుండా ఏడాదికి దాదాపు 200 చిత్రాలు నిర్మించడం దీర్ఘకాలంలో పరిశ్రమ మనుగడకు చేటు చేస్తుంది. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో స్టార్ హీరోలు నటించిన వాటికంటే మోస్తరు బడ్జెట్‌తో నిర్మించినవే హిట్ అవ్వడాన్ని మేకర్స్ గమనించాలి. అందుకు తగ్గట్లు సినిమాల నిర్మాణంలో మార్పులు చేసుకోవాలి. థియేటర్లకు ప్రజలని రప్పించే సినిమాలపై దృష్టి పెట్టాలి. ఈ ఏడాది మొత్తం 199 చిత్రాలు విడుదలయ్యాయి. అందులో కేవలం 26 చిత్రాలు విజయవంతం అయ్యాయి. రూ.1000 కోట్ల పెట్టుబడి పెడితే కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి పొందగలిగాము. రూ.700 కోట్ల నష్టం వచ్చింది" అని రిపోర్ట్‌లో కేరళ చిత్ర నిర్మాతల సంఘం పేర్కొంది.

చక్కని ఆదరణ లభిస్తోంది



వివ రెడ్డి హీరోగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. లయన్ శ్రీరాం దత్తి నిర్మించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో 'ఓ తండ్రి తీర్పు' చిత్రాన్ని నిర్మించారు. ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవడం ఎంతో మానసిక క్షోభకు గురిచేస్తుంది అనే ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు అయ్యింది. చక్కటి సందేశం ఉన్న ఈ సినిమాను ప్రతి కుటుంబం చూడాలని కోరుతున్నా' అని అన్నారు.




మరోసారి నువ్వే కావాలయ్యా

రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంలో 'నువ్వే కావాలయ్యా' అంటూ ప్రత్యేక గీతంలో నర్తించి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశారు తమన్నా భాటియా. సినిమా విజయంలో ఆ గీతం సైతం కీలకపాత్ర పోషించింది. ఇప్పుడు మరోసారి జైలర్‌తో కలసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారట తమన్నా. 'జైలర్ 2'లోనూ తమన్నా ప్రత్యేక గీతంలో మెరవనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు దర్శకుడు నెల్సన్ రెండో భాగంలో ఆమె పాత్ర నిడివిని పెంచారనీ, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అలాగే 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కూడా ఈ చిత్రంలో నటించబోతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

మార్చిలో సెట్స్‌పైకి షారుక్ చిత్రం

షారుక్ ఖాన్ సుజయ్ ఘోష్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'కింగ్'. రెడ్ చిల్లీస్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాలో అభిషేక్ బచ్చన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు



జరుగుతున్నాయి. ఇందులోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అంతర్జాతీయ స్టంట్ డైరెక్టర్లు పనిచేయనున్నట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కూడా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

ఉద్యోగాలు ఇప్పిస్తామనే

దళారులను నమ్మొద్దు

ఇంటర్వ్యూ



కేపీఎస్ కిశోర్, ఎస్పీ

పోలీస్ ఎంపికలకు నేడు ఫిజికల్ టెస్ట్

ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపించి డబ్బు వసూలు చేసే దళారుల మాటలు నమ్మవద్దు. పోటీ పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. నిష్పక్షపాతంగా నిర్వహించడం జరుగుతుంది. పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. పోలీసు ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ కిశోర్‌తో ఇంటర్వ్యూ.

- ఏలూరు క్రైం, ఆంధ్రజ్యోతి

? ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కానిస్టేబుల్ పోస్టులు.. దరఖాస్తుదారులు..

ఎస్పీ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 పోస్టులు ఉన్నాయి. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు ఇప్పటికే హాల్‌టిక్కెట్లు జారీ చేశాం. వీరిలో 3997 మంది పురుషులు, 979 మంది మహిళలు ఉన్నారు.

? దేహదారుఢ్య పరీక్షలు ఎప్పటి నుంచి..

ఎస్పీ : ఈనెల 30వ తేదీ తెల్లవారు జామున 3.45 గంటలకు ప్రారంభిస్తాం. రోజుకు 600 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నాం. జనవరి 9 వరకూ కొనసాగిస్తాం. జనవరి 3,4 తేదీలలో మహిళలకు మాత్రం ప్రత్యేకంగా మహిళా సిబ్బంది పర్యవేక్షణలో ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తాం.

? అభ్యర్థులు తేవాల్సిన ధృవపత్రాలు..

ఎస్పీ : అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలను వెరిఫికేషన్ కౌంటర్ వద్ద అందజేయాలి. ఎస్ఎస్‌సి మార్కుల లిస్టు, ఇంటర్మీడియట్ మార్కుల లిస్టులు ఒరిజినల్స్, డిగ్రీ మార్కుల లిస్టు, ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, క్రిమిలేయర్ సర్టిఫికెట్ (నోటిఫికేషన్ తేదీ తరువాత తీసుకున్నది మాత్రమే), స్టడీ సర్టిఫికెట్స్ 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఒరిజినల్ ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సర్టిఫికెట్లు, ఏబీసీ సర్వీస్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ ట్రైబల్ సర్టిఫికెట్ (ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్), పోలీస్‌శాఖకు చెందిన సిబ్బంది వారి పిల్లల ధ్రువీకరణపత్రాలు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మెరిటోరియల్ స్పోర్ట్స్ స్కోర్‌కార్డు (ఒరిజినల్ రిజల్టు), స్టేజ్ 1 అప్లికేషన్, స్టేజ్ 2 అప్లికేషన్స్ తీసుకురావాలి. జిరాక్స్‌లపై అటస్టేషన్ చేయించాలి.

? దేహదారుఢ్య పరీక్షల అంశాలు..

ఎస్పీ : అభ్యర్థులు 1600 మీటర్ల పరుగుపందెంలో డిస్క్వాలిఫై అయితే మిగిలిన ఈవెంట్స్‌కు అనుమతించం. అభ్యర్థులకు ఛాతీ కొలత, ఎత్తు, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ నిర్వహిస్తాం. మహిళా అభ్యర్థులకు ఎత్తు, బరువు, మిగిలిన ఈవెంట్స్‌ను నిర్వహించడం జరుగుతుంది.

? అభ్యర్థులు తేకూడనివి ..

ఎస్పీ : అభ్యర్థులు వారి సర్టిఫికెట్లు జిరాక్స్‌లు మినహా ఏవిధమైన వస్తువులను తీసుకురాకూడదు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. అభ్యర్థి తప్ప ఎవ్వరిని అనుమతించబడరు.

? ఫిజికల్ టెస్ట్ నిర్వహణ..

ఎస్పీ : ప్రతి ఈవెంట్ వద్ద డీఎస్పీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. మొత్తం 200 మంది పోలీస్ సిబ్బంది, అధికారులను ఏర్పాటు చేశాం. అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో గ్రౌండ్‌లో పలికి డ్యూటీలో ఉన్న వారు వారి డ్యూటీ ప్రదేశం తప్ప వేరే ప్రాంతానికి కూడా వెళ్లడానికి వీలులేదని ఆదేశాలు ఇచ్చాం. ఇతరులు ఎవరిని అనుమతించం. గ్రౌండ్ చుట్టూ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశాం.

? దళారులపై చర్యలు..

ఎస్పీ : పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దు. ఇలాంటి వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు ఇవ్వండి. లేదంటే వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం అందించండి. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్, పాల్గొన్న పోలీస్ అధికారులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. పోలీస్ కానిస్టేబుళ్ళ స్పోర్ట్స్ ఈవెంట్స్ సోమవారం జరుగనున్న దృష్ట్యా బందోబస్తులో నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఆదివారం సమావే శం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అభ్యర్థులు నిర్ణీత సమయానికే హాజరయ్యేలా తగిన సూచనలు ఇవ్వాలని, ప్రతి ఒక్క సర్టిఫికెట్ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అభ్యర్థులకు పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యతతో విధులను నిర్వర్తించాలన్నారు. ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు నిబంధనలు సవ్యంగా అమలు జరిగేలా ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థులను ఒక వరుసలో గ్రౌండ్‌లోకి అనుమతించాలని, వారితో మర్యాద, సహనంతో వ్యవహరించాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే గమనించి వైద్య సహాయ కేంద్రానికి తరలించాలని, పరిస్థితిని బట్టి వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ భీమారావు, తూర్పు గోదావరి జిల్లా ఏఎస్పీ ఎల్.చెంచురెడ్డి, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ వి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, వి.ఆది ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





బాలోత్సవం పోటీల్లో బహుమతులు అందుకున్న బాలలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రముఖులు

ముగిసిన బాలోత్సవం

పిల్లలకు శాస్త్రీయ దృక్పథం ఉండాలి : ఎమ్మెల్యే

విజేతలకు బహుమతుల పంపిణీ



ఎమ్మెల్సీ గోపీమూర్తి నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న విద్యార్థి తారక్ రామ్

భీమవరం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'బాలోత్సవం' పిల్లల సంబరాలు రెండో రోజైన ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. పోటీలు ముగియడంతో విజేతలు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) బాల బాలికలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు శాస్త్రీయ దృక్పథం ఉండాలన్నారు. భీమవరం బాలోత్సవం పిల్లల చదువులు, శాస్త్రీయ దృక్పథం పెంపునకు స్ఫూర్తి అన్నారు. ఉపాధ్యాయులు పి.రామభద్రరాజు, జీపీసీ.రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు జిమ్నాస్టిక్స్‌లో భాగమైన రోప్ స్కిప్పింగ్, మాల్కంబ్ పోల్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలల ప్రదర్శనను పలువురు అభినందించారు. బాల బాలికలు అన్ని అంశాల్లో ప్రతిభకనబరిచి ముందుకు సాగాలన్నారు. విజేతలకు బహుమతులకు వసుధ ఫౌండేషన్ నుంచి 10 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ, చెనమల్ల చంద్రశేఖర్, గాదిరాజు తాతరాజు, బండి రమేశ్, భీమవరం బాలోత్సవం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గాతల జేమ్స్, అసోసియేట్ కార్యదర్శి జి.ధనుష్, కార్యవర్గ సభ్యులు, రఫైల్, శ్రీదేవి, క్రాంతికుమార్, యశ్వంత్, కిరణ్, ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూలు హెచ్ఎం బి.శ్రీనివాసరావు, డీఎన్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివాజీ రాజు, చైతన్య ప్రసాద్, పి.శ్రీనివాస రాజు, గోపాలశర్మ, మల్లుల శ్రీనివాస్, శ్రీనివాసాచారి చెరుకువాడ రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.





అబ్బురపరిచిన విద్యార్థుల మాల్కంబ్ పోల్ విన్యాసాలు

14 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



వివరాలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే జానకిరామ్, నిర్వాహకులు

నర సాపురం, డిసెంబరు 29, (ఆంధ్రజ్యోతి); పట్టణంలోని రుస్తుంబాద కబడ్డి స్టేడియంలో జనవరి 14 నుంచి 18 వరకు జాతీయ స్థాయి కబడ్డి పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ చెప్పారు. రాష్ట్ర కబడ్డి అసోసియేషన్ సీఈవో వీరలంకయ్య, రాష్ట్ర కార్యదర్శి పద్మజ బాలతో కలసి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గోగులమ్మ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు పురుషుల విభాగంలో 29, మహిళల విభాగంలో 19 రాష్ట్రాల జట్లు పాల్గొంటాయన్నారు. పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ప్రైజ్‌మనీ రూ.7.50 లక్షలు అందించ నున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.1.50 లక్షలు, రూ.లక్ష, రూ.75వేలు, రూ.50 వేల చొప్పున నగదు బహుమతులు అందిస్తామన్నారు. పురుషులు, మహిళల జట్లకు రూ 3.25 లక్షలు చొప్పున సమాన ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. వీటితో పాటు షీల్డ్ కూడా ఇస్తామన్నారు.

పోటీలకు ఆల్ ఇండియా కబడ్డి అసోసియేషన్ తరుపున చెన్నైకు చెందిన బాలస్వామి పరిశీలకులుగా వస్తారన్నారు. వివిధ రాష్ట్రాల జట్లలో జాతీయ, అంతర్జాయ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. సమావేశంలో కమిటి సభ్యులు అడపాల బాబులు, కొప్పినీడి గోపి, ఈశ్వరరావు, గ్రంధి రవి, కబడ్డీ అసోషియేషన్ నాయకులు రాము, రాజు, లతకుమారి పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు నరసాపురం టీచర్ నాగలక్ష్మి



సదస్సులో సర్టిఫికెట్ అందుకుంటున్న నాగలక్ష్మి

నరసాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ హైస్కూల్‌లో ఇంగ్లీషు టీచర్ వీవీఎస్ఎస్. నాగలక్ష్మి గుజరాత్‌లో జరిగిన అంతర్జాతీయ ఇంగ్లీషు టీచర్స్ అసోసియేషన్ సదస్సులో పాల్గొన్నారు. పాలన్‌పూర్ యూనివర్సిటీ రెండు రోజులుగా నిర్వహించిన సదస్సులో ఆమె సమర్పించిన పరిశోధన పత్రాలకు యూనివర్సిటీ వీసీ నుంచి ప్రసంశపత్రాన్ని అందుకున్నారు. రెండు నెలల క్రితం యూనివర్సిటీకి ఆమె పరిశోధన పత్రాలు పంపడంతో సదస్సుకు ఆహ్వానం అందింది. మొత్తం 113 మంది పరిశోధన పత్రాలు సమర్పించగా 49 మంది ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రా ల నుంచి నాగలక్ష్మి ఒక్కరే ఉన్నారు. ఇంగ్లీషు భాషాభివృద్ధి, బహుభాషా బోధన, మాతృభాష ఆవశ్యకతలపై పరిశోధన పత్రాలతో ఆమె సదస్సులో ప్రసంగించారు. కోనసీమ జిల్లా అంతర్వేదికి చెందిన నాగలక్ష్మి 25ఏళ్లుగా ఇంగ్లీషు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఇంగ్లీషు భాషాభివృద్ధిపై ఆమె అనేక పరిశోధనలు చేశారు. ఈఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయురాల అవార్డు అందజేసింది. అంతర్జాతీయ టీచర్స్ సదస్సు ద్వారా నరసాపురం పేరును దేశవ్యాప్తంగా తెలియజేసిన నాగలక్ష్మికి ఎమ్మెల్యే నాయకర్, కొత్తపల్లి సుబ్బారాయుడు, పొత్తూరి రామరాజు, చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ అంజయ్య పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

మహిళా, శిశు సంక్షేమశాఖ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కార్యవర్గం

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఉద్యోగుల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం ఏలూరులో ఆదివారం జరిగింది. జిల్లా ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షురాలిగా పద్మావతి, జిల్లా అధ్యక్షుడిగా జె.సత్యనారాయణ, కార్యదర్శిగా ఝాన్సీరాణి, ట్రెజరర్‌గా ఎన్‌వీ.సతీష్ ఎంపికయ్యారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పీఆర్సీ కమిటీ ఏర్పాటు నిర్ణయంపై సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. సంక్రాంతిలోపు బకాయి డీఏలు కనీసం విడుదల చేయాలని కోరారు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, సమస్యలపై ప్రభుత్వ అధికారులు దృష్టిసారించాలన్నారు. ఉమ్మడి జిల్లా సూపర్‌వైజర్ల అసోసియేషన్ కూడా ఎన్నుకున్నారు. త్వరలో జిల్లా సమావేశాలు ఏర్పాటుచేసి సంఘం బలోపేతానికి కృషిచేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌కుమారి తెలిపారు. కార్యక్రమంలో టీవీవీ.ప్రసాద్, ఏ.శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రచయితల సభలో తణుకు తళుకులు

రసరాజుకు రిటైర్ట్ న్యాయమూర్తి ఎన్వీ రమణ సత్కారం



రసరాజును సన్మానిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రమణ

తణుకు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఈనెల 28, 29 తేదీలలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో తణుకు తళుకులు మెరిశాయి. కవి సమ్మేళనంలో ప్రముఖ కవి రసరాజు మాట్లాడుతూ దేశ భాషలకు సంగీత భాష తెలుగు భాష అన్నారు. ఏ రచనైనా సందేశ్మాకంగా, జాతిని మేల్కొల్పే దిశగా ఉండాలన్నారు. అనంతరం సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ రసరాజును శాలువాతో సత్కరించారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడు సంజీవ్‌కు హెల్త్‌కేర్ అవార్డు

భీమవరం టౌన్: హోమియో డాక్టర్ చిక్కం సత్య సంజీవ్ టైమ్స్ ఐకాన్స్ ఆఫ్ ది హెల్త్ కేర్ 2024 అవార్డు అందుకున్నారు. హోమియోపతిలో సంజీవ్ చేస్తున్న అత్యున్నత సేవలకు విజయవాడలో టైమ్స్ ఐకాన్స్ అఫ్ ది హెల్త్ కేర్ అవార్డు ప్రకటించింది. అవార్డు ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్ వెంకటరమణ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు వైద్యులు, స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు అభినందించారు. మరిన్ని ఉత్తమ సేవలందించాలని కోరారు.



పశ్చిమ అండర్12 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కార్తీక్ వర్మ

ఉండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా అండర్ 12 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఉండికి చెందిన నంబూరి కార్తీక్ వర్మ ఎంపికయ్యాడు. భీమవరం ఏసీఏ క్యాంప్ కోచ్ నుంచి ఎంపికయ్యాడు. అండర్ 12 విభాగం కెప్టెన్ కావడం అభినందనీయమని కోచ్ టి.శ్రీనివాస్ అన్నారు. తల్లిదండ్రులు నంబూరి సుబ్బరాజు, శ్రీలక్ష్మి దంపతులు ఆనందంను వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, పేరిచర్ల సుభాష్ రాజు, సర్పంచ్ నడింపల్లి సత్యవతి రామకృష్ణంరాజు, పేరిచర్ల అరుణ భార్గవి, క్రీడాకారులు కార్తీక్‌వర్మను అభినందించారు.

'క్రియ' అదిరింది!

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- రెండోరోజూ ప్రతిభకు పట్టాభిషేకం
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు



సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి

సర్పవరంజంక్షన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండుగ అంబరాన్నంటింది. రెండురోజులపాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక నృత్యప్రదర్శనలు, మైమరిపించే కోలాట నృత్యాలు, అబ్బురపరిచే రీతిలో ఆకట్టుకునేలా చిన్నారులు గీసిన పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో రెండురోజులుగానిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు పోటీలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు. సైన్స్ ఫేర్, చిత్రలేఖనం, సాంస్కృతిక నృత్యాలు, క్విజ్ పోటీలను స్వయం వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా జానపద నృత్యం (బృందం) విచిత్ర వేషధారణ(ఫ్యాన్సీ డ్రెస్), బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు తదిర అంశాల్లో పోటీలు జరిగాయి. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6, 7 తరగతులకు జూనియర్స్, 8,9,10 తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో రెండురోజులపాటు పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 11వేలమంది విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరాజు, డాక్టర్ కాద వెంకటరమణ, చుండ్రు జానకీరామ్ ప్రసాద్, మాచిరాజు, అల్లూరి సురేంద్ర, బత్తుల గణేష్, శివ, కృష్ణంరాజు పాల్గొన్నారు. పోటీలకు ప్రాంగణం ఇచ్చిన జేఎన్‌టీయూ వీసీ, దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.







వివిధ రకాల సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు



పిట్టల దొరగా..



యముడిగా..



అమ్మవారిగా..



హోలోవెన్స్‌గా..



సంప్రదాయ వేషధారణలో..



'భువనం విజయం' గురించి వివరిస్తూ..



కార్మికులు.. రైతు కూలీలుగా..



గిటార్ వాయిస్తూ..



'ఆదర్శ గ్రామం' ప్రాజెక్టుతో..



మట్టితో అందమైన ఆకృతులు

ఇంటర్వ్యూ..

ప్రతి రైతుకు సాగు నీరందిస్తాం



వెలమాటి రామచంద్రప్రసాద్, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, గోదావరి డీసీ చైర్మన్

- మండలంలో మీ డీసీ కింద ఎన్ని సాగునీటి సంఘాలు ఉన్నాయి?
జవాబు : మండల పరిధిలో కృష్ణా, గోదావరి కాల్వలతో పాటు మరో 26 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి.
- గోదావరి, కృష్ణా కాల్వల్లో సాగునీరు వచ్చే విధంగా ఉన్నాయా?
జవాబు: పూళ్ల నుంచి గుండుగొలను, మ ల్యాపురం వరకు 16 కిలోమీటర్ల పొడ వునా రూ. 56 లక్షలతో డెక్క తొలగింపు పనులకు కాంట్రాక్ట్ ఇచ్చారు కానీ కాం ట్రాక్టరు తొలగించక పోవడంతో సాగు నీరు పూర్తిగా వచ్చే అవకాశం లేదు.
- ఆయకట్టు చివరి రైతు పరిస్థితి ఏంటి?
జవాబు : దెందులూరు ఎమ్మెల్యే ఆఖరి రైతు వరకూ సాగునీరందించే చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే కాంట్రాక్టర్‌ను అధికారులు హెచ్చరించారు. పని పూర్తి చేయకపోతే కాంట్రాక్టు రద్దు చేయించి అధికారులతో కలిసి నీటి సంఘం అధ్యక్షులే దగ్గరుండి పని చేయిస్తారు.
- మండలంలో పంట పరిస్థితి ఏంటి?
జవాబు : మండలంలో 70 శాతం వరకూ వరి నారు మడులు పోశారు. ఊడ్పుల సమయానికి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోను ఆఖరి రైతు వరకూ సాగునీరందించి తీరుతాం.

(ఆంధ్రజ్యోతి-దెందులూరు)

సొసైటీ బలోపేతానికి కృషి చేయాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఇరిగేషన్ ఉద్యోగుల సొసైటీ 41వ మహాజన సభ జరిగింది. ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ దేశ సమైక్యతను, మత సామరస్యాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం భవనంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళి రావు, ఎ.అప్పలస్వామి, ఎం.సత్యం, ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత నివారించాలి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక అన్నేభవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో లేవన్నారు. ప్రైవేటు వ్యాపారుల వద్దే కొనుగోలు చేయాల్సి వస్తోందని, ఎరువుల కొరత సాకుచూపి అధిక ధరలకు అమ్ముతున్నారని చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.హనుమంతరెడ్డి అన్నారు. ఫోరం ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగం పరిరక్షణ-ప్రజల కర్తవ్యం అనే అంశంపై సదస్సును నిర్వహించారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా పాలకులు సరైనవారు కాకపోతే రాజ్యాంగం ప్రజారాజ్యాంగం అనిపించుకోదని వక్తలు పేర్కొన్నారు. అభ్యుదయవాదులు, వివిధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలధారులకు నిత్య భిక్ష

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శబరిమల జ్యోతి దర్శనానికి వెళ్ళే స్వాములకు, సర్వమాలధారణ భక్తులకు స్థానిక 25వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో రేపూరి భాస్కర గురుస్వామి ఈ నెల 15న చేపట్టిన నిత్య భిక్షా కార్యక్రమం కొనసాగుతోంది. సర్వమాలాధారులకు సంక్రాంతి వరకు నిత్య భిక్షను కొనసాగిస్తామని తెలిపారు. ఆదివారం విజయవాడ ఆర్టీసీ జోన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు భక్తులకు నిత్య భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి కడియాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం ఇఫ్టూ అనుబంధ జట్టు కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు జగ్గరపు రమణ అధ్యక్షతన సభ జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికవర్గం సాధించుకున్న హక్కులను తొలగిస్తూ ప్రశ్నించిన కార్మిక వర్గాన్ని జైలుకు పంపిస్తున్న మోదీకి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలన్నారు.

రక్షిత నీటి కోసం గిరిజనుల ఆందోళన



ధర్నా చేస్తున్న గిరిజన మహిళలు, సీపీఎం నాయకులు

పోలవరం డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సుద్ద నీటితో రోగాలపాలవుతున్నామని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ కోయనాగంపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలో సుద్దనీరు తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అధికారులు రక్షిత మంచినీటిని సరఫరా చేయడంలో విఫలమయ్యారన్నారు. మంచినీటి కోసం ప్రజలు వాహనాలపై తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి వెళ్ళి ప్రైవేటు వాటర్ ప్లాంటుల వద్ద 20 లీటర్లు 15 రూపాయలు కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయని, ఆటోల చార్జీలు అదనంగా చెల్లించవలసి వస్తుందన్నారు. రక్షిత నీటి కోసం కొత్తబోరు వేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ వ్యవస్థను నాశనం చేసిన జగన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఎన్నోసార్లు కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపి ఇప్పుడు కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచిందని విమర్శించటం సరికాదని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం మిగులు విద్యుత్‌ను జగన్ చేతిలో పెడితే ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్‌ఛార్జీలు పెంచి ప్రజలపై 32వేల కోట్ల భారం మోపారని అన్నారు. పోలవరం జలవిద్యుత్ కేంద్రం 2021లోనే పూర్తి కావల్సి ఉందని దాన్ని పూర్తి చెయ్యకపోవడం వల్ల రూ. 4700 కోట్లు రాష్ట్రానికి నష్టం వాటిల్లిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్‌మీటర్లు లాంటి విద్యుత్ పరికరాలను అధిక రేట్లుకు కొనుగోలు చేయడం వలన వేలకోట్లు నష్టపోయామన్నారు. సెకి ఒప్పందం ద్వారా వినియోగదారులపై 30 ఏళ్ళ కు లక్షకోట్ల భారాలు మోపారని మండిపడ్డారు. విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసి ఇప్పుడు రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేయ్యడం ఎంత వరకు సబబో ప్రజలు ఆలోచించాలన్నారు. పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి : మద్దిపాటి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమా ణాలతో రహదారిని నిర్మించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశించారు. ద్వారకా తిరుమలలో సుమారు రూ.40లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారి నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామంలో ప్రధాన రహదారి, ఆర్అండ్‌బి రహదారిపై ఆక్రమణలు పరిశీలించి అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయన ద్వారకాతిరుమల, సిహెచ్ పోతేపల్లి, సాయంపాలెం తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు లంకా సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చెయ్యాలి: రోషన్

లింగపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లు నాణ్యతతో త్వరగా పూర్తి చెయ్యాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన అనంతరం స్థానిక కూటమి నాయకులతో సమావేశమై మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వారిని అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు అభివృద్ధి పనులను పరిశీలించాలని, సంక్రాంతికల్లా పూర్తయ్యేలా పనులలో వేగం పెంచాలని అన్నారు.

సీపీఐ కార్యాలయాన్ని కూల్చిన వారిని శిక్షించాలి

టి.నరసాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెంలో సీపీఐ కార్యాలయాన్ని కూల్చివేసిన వారిని కఠినంగా శిక్షించి అందుకు సహకరించిన బుట్టాయిగూడెం మండల తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు, సీపీఐ ఏలూరు జిల్లా సమితి సభ్యుడు బొల్లినేని నాగార్జున సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మళ్ళీ కార్యాలయాన్ని పునర్నిర్మించకుంటే భవిష్యత్తులో తహసీల్దార్‌తో పాటు మరికొందరు రాజకీయ దళారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

చింతలపూడి: బుట్టాయిగూడెం సీపీఐ కార్యాలయాన్ని అధికారులు కూల్చివేయడాన్ని చింతలపూడి మండల సీపీఐ శాఖ తీవ్రంగా ఖండించింది. పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ జిల్లాలో పోరంబోకు భూములు ఎందరో కబ్జా చేశారని, ఆక్రమించిన వాటిని వెలికితీయాలన్నారు. బుట్టాయిగూడెంలో జరిగిన తీరుకు తహసీల్దార్ బాధ్యత వహించాలని, అక్కడే తిరిగి పార్టీ కార్యాలయ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. పి.సోమశేఖర్, టి.బాబు, జె.రామచంద్రారెడ్డి, వజ్రం, జానీ తదితరులు ఘటనను ఖండించారు.

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో సీపీఐ కార్యాలయం కూల్చివేత దుర్మార్గమని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కారం దారయ్య అన్నారు. ఆదివారం తూర్పు రేగులకుంటలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ కుట్రతోనే కార్యాలయాన్ని కూల్చివేశారని ఆరోపించారు. వందలాది పొగాకు బ్యారన్లు, ఇళ్ళు ప్రభుత్వ స్థలాల్లో గిరిజనేతరులు కట్టారని వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. కూల్చివేతకు పాల్పడిన తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

హేలాపురి కళాశాలపై అసత్య ప్రచారం నమ్మవద్దు



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ తదితరులు

దెందులూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొంత మంది కావాలని తమ కాలేజీపై సోషల్‌మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుంటామని హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ ఈవీ రమేష్, కళాశాల కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్, ట్రెజరర్ వెంకయ్య అన్నారు. ఆదివారం వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో చైర్మన్, కార్యదర్శులతో పాటు ట్రెజరర్ ఎం. వెంకయ్య, ప్రిన్సిపాల్ లావణ్య, కళాశాల ఏవో కరుణానిధి మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ కాలేజీలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. తమ కాలేజీకి ఉన్న మంచి పేరును పోగొట్టాలని కొందరు చెడ్డగా ప్రచారం చేస్తున్నారని, ఎవరూ వాటిని నమ్మవద్దని కోరారు. దీనిపై దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఉచిత చికిత్సా శిబిరం

భీమడోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులోని గ్రామదేవతల ప్రాంగణంలో ఆక్యు ప్రెజర్ ఉచిత చికిత్సా శిబిరం ఆదివారం జరిగింది. వచ్చే నెల 3 వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని వైద్యులు రామ్‌మనోహర్ లోహియా కోరారు. డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి, రేవంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపు జనవాణి

ఉంగుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు కార్యాలయంలో డిసెంబరు 31న ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనవాణి-ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అ'పూర్వ' సమ్మేళనం

పోలవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం గూటాల జడ్పీ హైస్కూలులో 1984-85 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకు న్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమతోటి విద్యార్థి, మూడు సార్లు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది, కేబినెట్ మంత్రిగా పనిచేసిన కారుపాటి వివేకానందను, పూర్వ విద్యార్థులు హనుమంతరావు, సింహాద్రి వెంకట్రావు, జల్లేపల్లి బాపిరాజు, రాఘవన్‌లను సన్మానం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మైగాపుల దుర్గాప్రసాద్, జల్లేపల్లి ధర్మరాజు, గిద్దా రామకృష్ణ, రావూరి పుష్కరం, మహంతి వెంకటేశ్వరరావు, మొగళ్ళ జ్యోతి, పూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మైన్ లైట్‌వెయిట్ డైమండ్ షోను ప్రారంభిస్తున్న కో ఆప్షన్ సభ్యురాలు నీతా జైన్

మలబార్‌లో డైమండ్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ డైమండ్స్ ఏలూరు షోరూమ్‌లో ఆదివారం మైన్‌లైట్‌వెయిట్ డైమండ్ షోను ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యురాలు నీతా విజయ్‌కుమార్ జైన్ ప్రారంభించారు. జనవరి 3 వరకు డైమండ్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు షోరూమ్ హెడ్ సోహైబ్ తెలిపారు. షోరూంను ప్రారంభించిన నీతా విజయ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ కాంతివంతంగా, ప్రకాశవంతంగా ఉండటానికి వజ్రాలు ఇష్టపడేవారి కోసం మల బార్ షోరూమ్‌లో రూపొందించబడిన ఆభరణాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. షోరూమ్ హెడ్ సోహైబ్ మాట్లాడుతూ ఆభరణాల ప్రేమికుల కోసం ఐదురోజుల పాటు డైమండ్ షోను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డైమండ్ విలువపై 25 శాతం తగ్గిస్తున్నట్లు తెలిపారు. షోరూమ్ మేనేజర్లు ప్రేమ్, అమీష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొఠారు ఇంటి వద్ద కొనసాగుతున్న నిరసన

పెదవేగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన సొమ్ము ఇచ్చే వరకు ఎన్నిరోజులైనా నిరసన కొనసాగిస్తామని కొల్లేరు లంక గ్రామస్థులు పేర్కొన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేపల చెరువుల కౌలు సొమ్ము ఇవ్వకుండా ఎగ్గొట్టి, లండన్ పారిపోయాడని, తమ సొమ్ము ఇచ్చేవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని వారు భీష్మించారు. కొండలరావుపాలెంలో అబ్బయ్య చౌదరి ఇంటివద్ద కొల్లేరు లంకగ్రామస్తులు నిరసన ఆదివారం 18వ రోజు కొనసాగింది. నేతల రవి, సైదు సత్యనారాయణ, ఘంటసాల శ్రీహరి, హరికృష్ణ, ముంగర హరిబాబు, గంగాధర రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఉంగుటూరు మండల అధ్యక్షుడిగా దుర్గారావు

ఉంగుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఉంగుటూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా వంజరపు దుర్గారావు రెండోసారి ఎన్నికయ్యారని నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా జరిగిన సమావేశంలో నగరపాటి సత్యనారాయణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్: బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధాకర్ కృష్ణ ఆధ్వర్యంలో ఏలూరు అసెంబ్లీ దక్షిణ మండల అధ్యక్ష ఎన్నిక జరిగింది. దొడ్డిగర్ల శేషశైలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుధాకర్ కృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బాడిత నారాయణ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, మహిళా నాయకురాలు ఆర్.నాగశిరోమణి తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు.

పోలవరం: క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేస్తానని బీజేపీ మండల నూతన అధ్యక్షుడు కరిబండి నాగేశ్వరరావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుల ఎన్నిక ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కట్టా సత్యన్నారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కరిబండి నాగేశ్వరరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి సహకరించాలి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ కోరారు. ఆదివారం సంఘ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సంఘ రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు సీనియర్ సిటిజన్ల హక్కులు, చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా పాతూరి రాంబాబు, విజయశ్రీ దంపతుల షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లికార్జునరావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, స్థానిక 17వ వార్డు



నంబూరి రామచంద్రరాజుకు సత్కారం

కౌన్సిలర్ నంబూరి రామచంద్రరావును సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

నగరంలో 'చిట్టి పొట్టి' యూనిట్ సందడి



ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిట్టకంటి రామ్, పవిత్ర కస్వి ప్రధానపాత్రలు పోషించి నటించిన చిత్రం చిట్టిపొట్టి. ఈ చిత్రం విజయయాత్రలో భాగంగా ఏలూరు, ఎస్.వి.సి థియేటర్‌లో యూనిట్ సభ్యులు సందడి చేశారు. ప్రేక్షకులతో కలసి కొద్దిసేపు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు భాస్కర్ యాదవ్ దాసరి మాట్లాడుతూ సిస్టర్ సెంటిమెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కుటుంబంతో సహా చూడదగ్గ విధంగా చిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు. హీరో రామ్ మాట్లాడుతూ ఇది తాను నటించిన రెండో చిత్రమని, చెల్లెలు సెంటిమెంట్‌తో చిత్రం రూపొందించగా ప్రతి ఒక్కర్ని కంటతడి పెట్టిస్తుందని, ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

కక్ష సాధింపుల్లేవ్!

(ఐదో పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. కోడిపందేలు, క్రికెట్ బెట్టింగులను నివారించగలిగారు.

సైబర్ నేరాలు.. సోషల్ మీడియాలో పోస్టులు

జిల్లాలోని పలువురు సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. లక్షలాది రూపాయలను పోగొట్టుకున్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలో రూ.కోటి 20 లక్షలు ఆన్‌లైన్‌లో పోగొట్టుకోగా, త్రీ టౌన్‌లోని ఒక మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి డిజిటల్ అరెస్టు అంటూ రూ.16 లక్షలు కాజేశారు. ఇలాంటి బాధితులు ఎందరో ఉన్నారు. కొన్ని కేసుల్లో రికవరీ చేసి బాధితులకు అందించగలిగారు. సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగించిన వారిపై పోలీసులు పట్టుబిగించారు. సెల్‌ఫోన్ పోతే సులభతరంగా ఫిర్యాదు చేయడానికి వాట్సాప్ నెంబర్‌ను పోలీస్ శాఖ ప్రవేశపెట్టింది. దీంతో వందలాది ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించారు.

బెంబేలెత్తించిన చిరుత, పులి

పోలవరం అటవీ ప్రాంతం నుంచి ఒక చిరుతపులి, ఒక పెద్ద పులి ఒకటి రెండు పర్యాయాలు జిల్లాలో సంచరించాయి. పోలవరం అటవీ ప్రాంతం నుంచి ఏలూరు సమీపంలోని పెదవేగి మండలం, చొదిమెళ్ళలోని తోటల వరకు వచ్చి తిరిగి వెళ్ళిపోయింది. తిరిగి వెళ్లే క్రమంలో పశువులు, కుక్కలపై దాడులు చేసింది.

ఆధ్యాత్మికం

గోదాదేవి సమేతంగా ఊరేగిన శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ధనుర్మాస ఉత్సవం ఆదివారం ఉదయం క్షేత్రపురవీధుల్లో వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను గోదాదేవి సమేతంగా తొళక్క వాహనంపై ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేసిన అనంతరం పూజాధికాలను నిర్వహించారు.

నేత్రపర్వం... రుద్రాభిషేకం



క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి వాహన సేవ జరిగింది. మాసశివరాత్రిని పురస్కరించుకుని జరిగిన గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది.

పెదవేగి: పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ అర్చకులు పావులూరి వీర వెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ సహిత దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు.

గుబ్బల మంగమ్మ ఆలయం కిటకిట

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో ఏజెన్సీకి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య వారంవారం పెరుగుతూనే ఉంది. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఒకరోజు ముందే పింఛన్లు

దెందులూరు, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): దెందులూరు మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర అన్ని రకాల పింఛన్లను ఒక్క రోజు ముందుగానే అందిస్తామని దెందు లూరు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా అన్ని గ్రామ సచివాల యాల పరిధిలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారులు, అంగన్వాడీ టీచర్‌తో పాటు సచివాలయాల సిబ్బందితో ముందు రోజు నూరు శాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

పే అండ్ అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్ఎస్ హరినాథ్ బాబు మరోసారి ఎన్నికయ్యారు. అమరావతిలో రాష్ట్ర సంఘం ఎన్నికలు హరినాథ్, రమణారెడ్డి ప్యానల్‌తో కూడిన 15 మంది రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, ఎన్టీఆర్‌జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఎన్నికల అధికారి విద్యాసాగర్ ప్రకటించారు. గాంధీనగర్, ఎన్జీవో హోమ్‌లో ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ ఎన్నికల్లో 5వ సారి హరినాథ్ రాష్ట్ర అధ్యక్షు డిగా ఎంపికైన సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ తరఫున అధ్యక్షు డు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.

రాష్ట్ర సగర సంఘ మహిళా అధ్యక్షురాలిగా వరలక్ష్మి

చింతలపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సగర సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన సాదరబోయిన వరలక్ష్మి నియమి తులయ్యారు. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు నుంచి ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సగర కుటుంబాల్లోని మహిళలను చైతన్యం చేసే విధంగా పాటుప డతానని పేర్కొన్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి

జీలుగుమిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ రక్షణ, ఆలయాల స్వయం ప్రతిపత్తి, గో సంరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం విజయవంతం చేయాలని హైందవ సైన్యం రాష్ట్ర కన్వీనర్ టీఎస్ రవికుమార్ అన్నారు. మండలంలో హిందువులంతా హైందవ శంఖారావంకు తరలి రావాలని ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించి టీ షర్టులు, కరపత్రాలు పంచారు. కక్కిరాల అప్పారావు, చిట్లూరి చందరావు, మాతంశెట్టి కిషోర్, కక్కిరాల మురళి, దార మధు, రేపాక గోపాలరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు 'పెద్దిన' మృతికి సంతాపం

టి.నరసాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దిన చంద్రశేఖర్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు కూటమి నాయకులు చంద్రశేఖర్ పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. చంద్రశేఖర్ మృతి కూటమికి తీరని లోటన్నారు. కూటమి నాయకులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణ, పిన్నమనేని మధు, బొంతు సత్యనారాయణ, పాలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల దర్శనంతో విజ్ఞానం

పెదవేగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయానికి రావడం అనేది విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే అవుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథ పఠనం చేశారు.

క్రైమ్ కార్నర్

కోడి పందేలపై దాడి

లింగపాలెం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లతో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కే వెంకన్న తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని ధర్మాజీగూడెం శివారు కాటంరెడ్డిపల్లిలో బెట్టింగ్‌లపై కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారమందడంతో కోడిపందేల స్థావరం పై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక పుంజు, ఒక కోడికత్తి, రూ. 1150 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కే వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భీమడోలులో..

భీమడోలు: గుండుగొలను కుండీలపేట శివారులో కోడిపందేలపై భీమడోలు పోలీసులు దాడుల చేశారు. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది కోడి పందేల స్థావరంపై దాడులు చేసి 9 మందిని అదుపులోకి తీసుకుని రూ. 3500 రూపాయలు నగదు, ఏడు మోటారు సైకిళ్ళు, ఒక కోడి పుంజు, రెండు కత్తులను స్వాధీనపర్చుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి పనికి వెళ్తూ గుండెపోటుతో మహిళ మృతి

కుక్కునూరు: పత్తిపనికి వెళ్తూ ఆదివారం కుక్కునూరుకు చెందిన కిట్టం మహాలక్ష్మి (42) అనే మహిళ గుండెపోటుతో మృతి చెందింది. ప్రతీ రోజులాగే పత్తి తీయడానికి ఇంటి నుంచి బయల్దేరిన కొద్ది సేపటికి గుండెపోటుకు గురై పడిపోయింది. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందింది. దీంతో కుక్కునూరులోని సంజయ్‌నగర్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉద్యోగాలు ఇప్పిస్తామనే

దళారులను నమ్మొద్దు

ఇంటర్వ్యూ



కేపీఎస్ కిశోర్, ఎస్పీ

పోలీస్ ఎంపికలకు నేడు ఫిజికల్ టెస్ట్

ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపించి డబ్బు వసూలు చేసే దళారుల మాటలు నమ్మవద్దు. పోటీ పరీక్షలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. నిష్పక్షపాతంగా నిర్వహించడం జరుగుతుంది. పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. పోలీసు ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ కిశోర్‌తో ఇంటర్వ్యూ.

- ఏలూరు క్రైం, ఆంధ్రజ్యోతి

? ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కానిస్టేబుల్ పోస్టులు.. దరఖాస్తుదారులు..

ఎస్పీ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 204 పోస్టులు ఉన్నాయి. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన 4976 మంది అభ్యర్థులకు ఇప్పటికే హాల్‌టిక్కెట్లు జారీ చేశాం. వీరిలో 3997 మంది పురుషులు, 979 మంది మహిళలు ఉన్నారు.

? దేహదారుఢ్య పరీక్షలు ఎప్పటి నుంచి..

ఎస్పీ : ఈనెల 30వ తేదీ తెల్లవారు జామున 3.45 గంటలకు ప్రారంభిస్తాం. రోజుకు 600 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నాం. జనవరి 9 వరకూ కొనసాగిస్తాం. జనవరి 3,4 తేదీలలో మహిళలకు మాత్రం ప్రత్యేకంగా మహిళా సిబ్బంది పర్యవేక్షణలో ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తాం.

? అభ్యర్థులు తేవాల్సిన ధ్రువపత్రాలు..

ఎస్పీ : అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలను వెరిఫికేషన్ కౌంటర్ వద్ద అందజేయాలి. ఎస్ఎస్‌సి మార్కుల లిస్టు, ఇంటర్మీడియట్ మార్కుల లిస్టులు ఒరిజినల్స్, డిగ్రీ మార్కుల లిస్టు, ప్రొవిజినల్ లేదా ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, క్రిమిలేయర్ సర్టిఫికెట్ (నోటిఫికేషన్ తేదీ తరువాత తీసుకున్నది మాత్రమే), స్టడీ సర్టిఫికెట్స్ 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఒరిజినల్ ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సర్టిఫికెట్లు, ఏబీసీ సర్వీస్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ ట్రైబల్ సర్టిఫికెట్ (ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్), పోలీస్‌శాఖకు చెందిన సిబ్బంది వారి పిల్లల ధ్రువీకరణపత్రాలు, ఎక్స్‌సర్వీస్‌మెన్, మెరిటోరియల్ స్పోర్ట్స్, స్కోర్‌కార్డు (ఒరిజినల్ రిజల్టు), స్టేజ్ 1 అప్లికేషన్, స్టేజ్ 2 అప్లికేషన్స్ తీసుకురావాలి. జిరాక్స్‌లపై అటస్టేషన్ చేయించాలి.

? దేహదారుఢ్య పరీక్షల అంశాలు..

ఎస్పీ : అభ్యర్థులు 1600 మీటర్ల పరుగుపందెంలో డిస్క్వాలిఫై అయితే మిగిలిన ఈవెంట్స్‌కు అనుమతించం. అభ్యర్థులకు ఛాతీ కొలత, ఎత్తు, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ నిర్వహిస్తాం. మహిళా అభ్యర్థులకు ఎత్తు, బరువు, మిగిలిన ఈవెంట్స్‌ను నిర్వహించడం జరుగుతుంది.

? అభ్యర్థులు తేకూడనివి ..

ఎస్పీ : అభ్యర్థులు వారి సర్టిఫికెట్లు జిరాక్స్‌లు మినహా ఏవిధమైన వస్తువులను తీసుకురాకూడదు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. అభ్యర్థి తప్ప ఎవ్వరిని అనుమతించబడరు.

? ఫిజికల్ టెస్ట్ నిర్వహణ..

ఎస్పీ : ప్రతి ఈవెంట్ వద్ద డీఎస్పీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. మొత్తం 200 మంది పోలీస్ సిబ్బంది, అధికారులను ఏర్పాటు చేశాం. అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో గ్రౌండ్‌లో పలికి డ్యూటీలో ఉన్న వారు వారి డ్యూటీ ప్రదేశం తప్ప వేరే ప్రాంతానికి కూడా వెళ్లడానికి వీలులేదరి ఆదేశాలు ఇచ్చాం. ఇతరులు ఎవరిని అనుమతించం. గ్రౌండ్ చుట్టూ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశాం.

? దళారులపై చర్యలు..

ఎస్పీ : పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దు. ఇలాంటి వారి సమాచారాన్ని వెంటనే పోలీసులకు ఇవ్వండి. లేదంటే వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం అందించండి. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్, పాల్గొన్న పోలీస్ అధికారులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. పోలీస్ కానిస్టేబుళ్ల స్పోర్ట్స్ ఈవెంట్స్ సోమవారం జరుగనున్న దృష్ట్యా బందోబస్తులో నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఆదివారం సమావే శం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అభ్యర్థులు నిర్ణీత సమయానికే హాజరయ్యేలా తగిన సూచనలు ఇవ్వాలని, ప్రతి ఒక్క సర్టిఫికెట్ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అభ్యర్థులకు పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యతతో విధులను నిర్వర్తించాలన్నారు. ఏపీ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు నిబంధనలు సవ్యంగా అమలు జరిగేలా ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థులను ఒక వరుసలో గ్రౌండ్‌లోకి అనుమతించాలని, వారితో మర్యాద, సహనంతో వ్యవహరించాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే గమనించి వైద్య సహాయ కేంద్రానికి తరలించాలని, పరిస్థితిని బట్టి వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ భీమారావు, తూర్పు గోదావరి జిల్లా ఏఎస్పీ ఎల్.చెంచురెడ్డి, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ వి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, వి.ఆది ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పే అండ్ అకౌంట్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ఏలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్ఎస్ హరినాథ్‌బాబు మరోసారి ఎన్నికయ్యారు. అమరావతిలో రాష్ట్ర సంఘం ఎన్నికలు హరినాథ్, రమణారెడ్డి ప్యానల్‌తో కూడిన 15 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఎన్నికల అధికారి విద్యాసాగర్ ప్రకటించారు. గాంధీనగర్, ఎన్జీవో హోంలో ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ ఎన్నికల్లో 5వ సారి హరినాథ్ రాష్ట్ర అధ్యక్షు డిగా ఎంపికైన సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ తరపున అధ్యక్షు డు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.

రాష్ట్ర సగర సంఘ మహిళా అధ్యక్షురాలిగా వరలక్ష్మి

చింతలపూడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సగర సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన సాదరబోయిన వరలక్ష్మి నియమితులయ్యారు. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు నుంచి ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సగర కుటుంబాల్లోని మహిళలను చైతన్యం చేసే విధంగా పాటుప డతానని పేర్కొన్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

కక్ష సాధింపుల్లేవ్!

(ఐదో పేజీ తరువాయి)

అరెస్టు చేశారు. కోడిపందేలు, క్రికెట్ బెట్టింగులను నివారించగలిగారు.

సైబర్ నేరాలు.. సోషల్ మీడియా పోస్టులు

జిల్లాలోని పలువురు సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. లక్షలాది రూపాయలను పోగొట్టుకున్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలో రూ.కోటి 20 లక్షలు ఆన్‌లైన్‌లో పోగొట్టుకోగా, త్రీ టౌన్‌లోని ఒక మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి డిజిటల్ అరెస్టు అంటూ రూ.16 లక్షలు కాజేశారు. ఇలాంటి బాధితులు ఎందరో ఉన్నారు. కొన్ని కేసుల్లో రికవరీ చేసి బాధితులకు అందించగలిగారు. సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగించిన వారిపై పోలీసులు పట్టుబిగించారు. సెల్‌ఫోన్ పోతే సులభతరంగా ఫిర్యాదు చేయడానికి వాట్సాప్ నెంబర్‌ను పోలీస్ శాఖ ప్రవేశపెట్టింది. దీంతో వందలాది ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించారు.

బెంబేలెత్తించిన చిరుత, పులి

పోలవరం అటవీ ప్రాంతం నుంచి ఒక చిరుతపులి, ఒక పెద్ద పులి ఒకటి రెండు పర్యాయాలు జిల్లాలో సంచరించాయి. పోలవరం అటవీ ప్రాంతం నుంచి ఏలూరు సమీపంలోని పెదవేగి మండలం, చొదిమెళ్ళలోని తోటల వరకు వచ్చి తిరిగి వెళ్ళిపోయింది. తిరిగి వెళ్లే క్రమంలో పశువులు, కుక్కలపై దాడులు చేసింది.

పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల ఏర్పాటుపై కసరత్తు

ముదినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటుపై ఎన్డీఏ కూటమి నాయకులు కసరత్తు చేస్తున్నారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల స్థానంలో నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వం నిర్ణయం మేరకు సంఘాలకు నియమించనున్న త్రిసభ్య కమిటీలకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలోని 15 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు గత రెండు రోజులుగా కూటమి నాయకులు కసరత్తు చేసి తుది జాబితాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో 11 పీఏసీఎస్‌లకు కమిటీల సభ్యులు, చైర్మన్లు పదవులకు అభ్యర్థుల ఎంపిక పూర్తి కాగా, నాలుగు సంఘాలకు ఎంపికపై చర్చలు జరుగుతున్నాయి. ఈ కమిటీల చైర్మన్ల పదవులకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయ కుల మధ్య దాదాపు ఏకాభిప్రాయం కుదిరింది. సోమవారం తుది జాబితాలను మండల ఎన్డీఏ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు అందజేయనున్నారు. పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల సభ్యుల పదవులకు గ్రామస్థాయి నాయకులకే ఎన్డీఏ కూటమి నాయకులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ఈ కమిటీల చైర్మన్ల ద్వారానే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్లు, చైర్మన్ పదవికి కూడా అభ్యర్థులను నామినేట్ చేసే అవకాశం ఉన్నందున పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవులకు మండలంలోని ఒకరిద్దరు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. బీజేపీ, జనసేన నాయకులు కొందరికి కలిదిండి, కైకలూరు ఏఎంసీ డైరెక్టర్ల పదవులు ఇచ్చేలా బుజ్జగించి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల చైర్మన్లు, సభ్యుల పదవులకు ఏకాభిప్రాయం సాధించినట్లు తెలిసింది.

విద్యుత్ చార్జీలపై వైసీపీ పోరుబాట సిగ్గుచేటు

కలిదిండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలపై వైసీపీ పోరుబాట పేరిట ధర్నాలు నిర్వహించటం సిగ్గు చేటు అని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మట్టగుంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ విధ్వంస విధానాలు అడ్డు అదుపు లేని అవినీతితో విద్యుత్ రంగం సంక్షోభంలో పడిందన్నారు. కూటమి నాయకులు వీరబ్రహ్మం, దుర్గారావు, వెంకటేశ్వరరావు, పరశురాముడు, తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్‌లో నవ్య శ్రీకి ప్రథమ బహుమతి



నవ్యశ్రీకి బహుమతి అందజేస్తున్న ఏలూరు నెహ్రూ యువ కేంద్రం సభ్యులు

ముదినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఏలూరులో నెహ్రూ యువక కేంద్రం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పెయింటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ముదినేపల్లి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థిని ముత్యా నవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించింది. ఆదివారం ఏలూరులో జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో నవ్యశ్రీకి నెహ్రూ యువ కేంద్రం అధికారి డి.కిషోర్‌కు రూ.2500 నగదు బహుమతి, మెమెంటో ప్రశంసాపత్రం అందజేశారు కళాశాల ప్రిన్సిపాల్ నక్కా కనక మోహనరావు, అధ్యాపకులు అభినందించారు.



ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోడూరు ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వరరావు

శివారు గ్రామాలకు నీరందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు/కలిదిండి,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సాగు, తాగునీరు పూర్తిస్థాయిలో అందేలా నూతనంగా ఎన్నికైన డీసీ చైర్మన్లు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. నూతనంగా ఎన్నికైన కోడూరు సాగునీటి సంఘాల ప్రాజెక్ట్ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు వరహా పట్నంలో ఆదివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని కావాల్సిన చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. గోపవరంలో నూతనంగా ఎన్నికైన ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులను ఆ గ్రామ టీడీపీ నాయకుడు ఆలూరి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. కైకలూరు మండలం ఆలపాడు వినాయకస్వామి, శివాలయం, భుజబల పట్నం వినాయకస్వామి ఆలయం, కైకలూరు కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, షిర్డీసాయి ఆలయాల్లో, కలిదిండి వెంకటేశ్వరస్వామి ఆలయం,పాతాళ భోగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అంకాల దుర్గా ప్రసాద్ ఎన్నిక



దుర్గా ప్రసాద్

కలిదిండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా అంకాల దుర్గా ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం కలిదిండిలో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, బీజేపీ నాయకులు నంబూరి బాండురాజు, కోకా శ్రీనివాసరావు, రమేష్, చిట్టూరి రవీంద్ర, చెన్నంశెట్టి మురళీకృష్ణ, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ముదినేపల్లి మండల అధ్యక్షురాలిగా నాగలక్ష్మి ఎన్నిక

ముదినేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షురాలికి పెయ్యేరుకు చెందిన సత్యవోలు నాగలక్ష్మి తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పెయ్యేరు ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఎన్నికల అధికారి నగరపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, బూత్ కమిటీల అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నాగలక్ష్మికి ఎన్నిక ధృవీకరణ పత్రం అందజేస్తున్న బీజేపీ ఎన్నికల అధికారి సత్యనారాయణ, కోటప్రోలు

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి : మంత్రి పార్థసారథి



చిన్నంపేట వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. జీవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పటల్ విజయవాడ సౌజన్యంతో చిన్నంపేటలో మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఏ చిన్న రుగ్మతను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగా పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామన్నారు. శిబిరంలో మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. టీడీపీ నాయకులు అత్తులూరి శ్రీనివాసరావు, మందపాటి బసవారెడ్డి, మొరంపూడి శ్రీనివాసరావు కందుల కృష్ణ, మరిడి చిట్టిబాబు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌తో శ్రీనివాసరావు

యాదవుల సంక్షేమానికి కృషి చేయాలి

మునునూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంక్షేమానికి కృషిచేయాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌ను మునునూరు వైస్ సర్పంచ్ తోటా శ్రీనివాసరావు కోరారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నరసింహ యాదవ్‌ను ఆదివారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో యాదవుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు రాయితీపై గొర్రెల కాపరులకు రుణాలను అందచేసి వారికి బీమా సౌకర్యాన్ని కల్పించాలని శ్రీనివాసరావు కోరారు. యాదవులు వెనుకబాటుతనాన్ని అధిగమించేవిధంగా సహకరించాలని ఆయన కోరారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి) పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మాలలు సహకరించాలి



చనుబండలో ఎమ్మార్పీఎస్ నేతల ప్రదర్శన

చాట్రాయి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంద కృష్ణమాదిగ సారథ్యంలో ఎమ్మార్పీఎస్ చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఉన్నత న్యాయ స్థానం తీర్పును గౌరవించి మాలలు వర్గీకరణకు సహకరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. చనుబండలో ఆదివారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు వర్గీకరణకు అనుకూలంగా జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మా దిగలు వెనుకబడి ఉండడానికి కారణం రిజర్వేషన్ ఫలితాలు సరిగా అందకపోవడం వలనే అన్నారు. అనంతరం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మొలుగుమాటి రవిరామ్ ఆధ్వర్యంలో చనుబండ ఎమ్మార్పీఎస్ కమిటీకి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కారుమంచి విస్తరయ్య, ఉపాధ్యక్షుడిగా విసంపల్లి రాజా, ప్రధాన కార్యదర్శిగా గద్దల కుటుంబరావు, ట్రెజరర్‌గా విసంపల్లి నరేష్, ప్రచార కార్యదర్శిగా కంచ ర్ల భాస్కరరావు ఎన్నికైనట్లు ప్రకటించారు.

నూజివీడు సబ్ జైలులో సౌకర్యాలపై ఆరా



సబ్ జైలులో మాట్లాడుతున్న న్యాయాధికారి అరుణ సారిక

నూజివీడు టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ జైలులో సౌకర్యాలపై కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి అరుణ సారిక ఆరా తీశారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సెక్రటరి కె.వి కృష్ణయ్యతో కలిసి ఆదివారం సబ్ జైలును సందర్శించారు. ఖైదీలకు సౌకర్యాలు, భోజన వసతి పరిశీలించారు. వారికి అందుతున్న న్యాయ సహాయం, న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదుల ఏర్పాటు అంశాలను అడిగి తెలుసుకున్నారు. జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

దత్తాశ్రమం దర్శించిన మంత్రి పార్థసారథి

నూజివీడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవదేవ దత్తాశ్రమంలో శివాలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి వచ్చిన దత్తశ్రీ గణపతి సచ్చిదానందస్వామిని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులను పొందారు. అనంతరం దత్తాశ్రమ ప్రాంగణంలో నిర్మించిన దేవ దేవదత్తస్వామిని మహాగణపతి, అనంతేశ్వరస్వామిని సారధి దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు, దత్త విజయానందస్వామి ఆశీర్వచనాలను తీసుకున్న మంత్రి అనంతరం మాట్లాడుతూ దత్తస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో సుభి క్షంగా ఉండాలని, దేవదత్త స్వామి అనుగ్రహంతో ప్రజలంతా అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గణపతి సచ్చిదానందస్వామి సారథికి వివరిం చారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఇంటర్వ్యూ..

రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం



నారగాని నాగేశ్వరరావు, ముదినేపల్లి డీసీ చైర్మన్

- **డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా మీరు చేపట్టే చర్యలు?**

జవాబు : నా పదవికి న్యాయం చేస్తా. ఏళ్ల తరబడి మరుగున పడిపోయిన ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థలను ప్రక్షాళనకు కృషి చేస్తా.

- **మీ పరిధిలో డ్రెయిన్లు, పంట కాల్వల పరిస్థితి ఏమిటి?**

జవాబు : ముదినేపల్లి డీసీ పరిధిలో పోల్‌రాజ్ ప్రధాన పంట కాల్వ, మేజర్ డ్రెయిన్‌తో పాటు పలు మీడియం, మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. గత ఐదేళ్లుగా ఇవి అభివృద్ధికి నోచుకోలేదు.

- **ప్రధాన సమస్య ఏమిటి?**

జవాబు : చినకొమ్మిలేరు డ్రెయిన్ పూర్తిగా పూడిపోయింది. గుర్రపు డెక్కతో నిండిపోయింది. ఆ డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వించాలి.

- **నిధుల కోసం ఏ ప్రయత్నాలు చేస్తారు?**

జవాబు : డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తాం. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు సాధిస్తాం.

- **నీటి సంఘాలన్నీ ఏకగ్రీవం కావడంపై మీ అభిప్రాయం?**

సంఘాలు ఏకగ్రీవం అయ్యేందుకు రైతులు సహకరించారు. గత ప్రభుత్వం సాగు, మురుగునీటి వ్యవస్థలను పట్టించుకోలేదన్న భావనతోనే కూటమికి రైతులు నీటి సంఘాలను ఏకగ్రీవంగా అప్పజెప్పారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

(ఆంధ్రజ్యోతి - ముదినేపల్లి)

రహదారిని తిరగేసి వదిలేశారు..

కలిదిండి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూల్లంక - పెదలంక ప్రధాన రహదారిని ఆరు కిలోమీటర్ల మేర కంకర తిరగేసి వదిలేశారు. దీంతో రహదారి పెద్ద గోతులు పడి అధ్వానంగా మారి ప్రయాణించేందుకు వీలు లేకుండాపోయింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ఆర్టీసీ బస్సుల రాకపోకలను నిలుపుదల చేశారు. నాలుగేళ్ల క్రితం వైసీపీ హయాంలో ఈ రహదారిని తిరగేసి తారు వేయకుండా వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి రేపే తుది గడువు

మునునూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా ప్రీమియం గడువు ఈనెల 31 వరకు మాత్రమే ఉందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరి, మినుము, పెసర, మొక్కజొన్న సాగుచేసిన రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించి, ప్రయోజనాలను పొందాలన్నారు. పంటల బీమా వల్ల ప్రభుత్వ సబ్సిడీ పథకాలతో పాటు పంటకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వాటిని పొందవచ్చని ఆయన వివరించారు. రైతులు నెలాఖరులోగా పంటల బీమా ప్రీమియం చెల్లించేలా చూడాలని రాయంకుల కోరారు.



టీడీపీ సభ్యత్వం అందజేస్తున్న గణేశ్

కార్యకర్తలకు అండగా టీడీపీ

మునునూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషిచేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేశ్ అన్నారు. గోపవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి రూ. 5లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. కార్యకర్తల కుటుంబంలో విద్యార్థుల చదువు నిమిత్తం ఆర్థిక సాయం, ఉపాధికి సహకారం, ఉద్యోగ అవకాశాల కల్పనకు పార్టీ అధినేత చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. ఈనెల 31లోగా సభ్యత్వం తీసుకోవాలని గణేశ్ కోరారు. గ్రామంలో 130మంది సభ్యత్వం తీసుకున్నారని, ఇప్పటివరకు మొత్తం 2,110 సభ్యత్వాలు చేయడం జరిగిందని తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆగిరిపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లిలో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. దాడిలో ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.